ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
శనివారం 26 అక్టోబరు 2024 www.prajaaswaramdaily.com 2pm

# తెలంగాణ రైల్వేకు మహర్దశ

రూ. 86 వేల కోట్లతో 15 ప్రాజెక్టులు.. మారనున్న తెలంగాణ రైల్వేల ముఖచిత్రం.. రూ. 650 కోట్లతో వరంగల్ రైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్... వేలాది మందికి దక్కనున్న ఉపాధి, మేక్ ఇన్ ఇండియాకు ఊతం అని ఎక్స్ వేదికగా తెలంగాణ బీజేపీ పోస్టు చేసింది.

హైదరాబాద్, ప్రజాస్వరం




## నాకు ఆ ఉద్దేశం లేదు



**సినిమా :** నాగ చైతన్యతో విడాకుల తర్వాత ఒంటరి గానే ఉంటున్న విషయం తెలిసిందే. ప్రేమించి పెళ్లి చేసుకున్న ఈ జంట మనస్పర్థల కారణంగా విడిపోయారు. ఇటీవల చైతూ రెండో పెళ్లికి రెడీ అయ్యారు. శోభిత ధూళిపాళతో త్వరలోనే పెళ్లి పీటలెక్కబోతున్నారు. ఇక ప్రస్తుతం సమంత మళ్లీ నటనలో బిజీ అయ్యారు. ఆమె నటించిన వెబ్ సిరీస్ 'సిటాడెల్: హనీ బన్నీ' త్వరలోనే విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆమె తన రెండో పెళ్లిపై షాకింగ్ కామెంట్స్ చేశారు. "నేను ప్రేమించి, ఇష్టపడి పెళ్లి చేసుకున్నాను. కానీ, ఇప్పుడు విడిపోయాం. అందుకే జీవితంలో రెండో పెళ్లి గురించి ఆలోచించడం లేదు. నాకు మరో వ్యక్తి అవసరం లేదు. ప్రస్తుతం హ్యాపీగానే ఉన్నా" అని ఆమె చెప్పుకొచ్చారు. దీంతో సమంత కామెంట్స్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

## బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంఎస్ ధోనీ




**ఝార్ఖండ్ :** ఝార్ఖండ్ ఎన్నికలకు బ్రాండ్ అంబాసిడర్‌గా భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ వ్యవహరించనున్నారు. ఈమేరకు సీఈఓ రవికుమార్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లకు అవగాహన కల్పించే కార్యక్రమంలో తన ఫొటోను ఈసీ వినియోగించుకునేందుకు ధోనీ సమ్మతి తెలిపారు. ఇతర వివరాలపై త్వరలోనే ఆయనతో సంప్రదింపులు జరుపుతామని, ఓటర్లలో ఓటుహక్కుపై చైతన్యం కలిగించేందుకు ధోనీ కృషి చేస్తారని భావిస్తున్నాం అని ఆయన పేర్కొన్నారు. స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమంలో భాగంగా ఓటర్లలో అవగాహన పెంచేందుకు ధోనీ కృషి చేయనున్నారని తెలిపారు. మొత్తం 81 స్థానాలకు నవంబరు 13, 20న రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. నవంబరు 23న ఎన్నికల ఫలితాలు వెల్లడి కానున్నాయి. శుక్రవారంతో నామినేషన్ల ప్రక్రియ సైతం పూర్తయింది.

## 50 ఏళ్ల నట ప్రస్థానం

### ఎక్స్ వేదికగా మెగాస్టార్ చిరంజీవి ఎమోషనల్ పోస్టు

**హైదరాబాద్, ప్రజాస్వరం:** మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా చేసిన ఓ ఎమోషనల్ పోస్ట్ ప్రస్తుతం బాగా వైరల్ అవుతోంది. తన నట ప్రస్థానానికి యాభై ఏళ్లు పూర్తయిన సందర్భంగా అప్పటి రోజులను గుర్తు చేసుకోవడం ఈ పోస్టులో ఉంది. "డిగ్రీ చదువుకునేటప్పుడు నర్సాపూర్ వైఎన్ఎం కాలేజ్ లో రంగస్థలం మీద రాజీనామా అనే తొలి నాటకం వేశాను. నటుడిగా తొలి గుర్తింపు వచ్చింది. అది బెస్ట్ యాక్టర్‌ను చేయడంతో పాటు ఎనలేని ప్రోత్సాహాన్ని అందించింది. 1974 –2024: 50 సంవత్సరాల నట ప్రస్థానం.. ఎనలేని ఆనందం!" అని చిరు తన పోస్టులో రాసుకొచ్చారు. దీనికి అప్పటి తన పాత ఫొటోను జోడించారు. ప్రస్తుతం మెగాస్టార్ షేర్ చేసిన ఈ పోస్టు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. మెగా అభిమానులు దీన్ని తెగ షేర్ చేస్తున్నారు.



## బోనస్ దేవుడెరుగు.. మద్దతు ధర ఏదీ?

- రైతు డిక్లరేషన్ బోగస్.. కర్షక ద్రోహి కాంగ్రెస్
- మాజీమంత్రి కేటీఆర్



**హైదరాబాద్, ప్రజాస్వరం:** తెలంగాణలో తెల్ల బంగారం తెల్లబోతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. పత్తి కొనుగోళ్ల తీరుపై ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. బోనస్ దేవుడెరుగు.. మద్దతు ధరకే దిక్కు లేదని ఎద్దేవా చేశారు. దళారుల చేతిలో పత్తి రైతులు చిత్తవుతున్నారని పేర్కొన్నారు. కొర్రీలతో సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపేసిందన్నారు. రైతు ఆగమవుతుంటే ప్రభుత్వం పత్తా లేదన్నారు. పత్తి కొనుగోళ్ల అంశంలో ప్రభుత్వ చొరవ లేదని చెప్పారు. రైతు డిక్లరేషన్ బోగస్.. కర్షక ద్రోహి కాంగ్రెస్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్‌లోనే బాంబులు పేలనున్నాయి

### మంత్రి శ్రీనివాస్ వ్యాఖ్యలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి కౌంటర్



**హైదరాబాద్, ప్రజాస్వరం:** మంత్రి పొంగులేటి చెప్పి బాంబులు కాంగ్రెస్ లోనే పేలబోతున్నాయంటూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ కు వస్తున్న ముప్పును శ్రీనివాస్ రెడ్డి ముందుగానే పసిగట్టారని ఎద్దేవా చేశారు. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు తలోదారి అయ్యారని విమ ర్శించారు. ప్రజల దృష్టిని మళ్లించడం కోసం కాంగ్రెస్ మంత్రులు, నాయకులు కొత్త డ్రామాలకు తెర లేపుతున్నారని అన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి కి రాహుల్ గాంధీ ఇటీవల కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదనే విషయాన్ని గుర్తు చేశారు. ఎవరి కుర్చీలు కదులుతాయో త్వరలోనే చూస్తామని ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. దీపావళి రాక ముందు తెలంగాణలో రెండు, మూడు బాంబులు పేలబోతున్నాయని, గత ప్రభుత్వంలోని పలువురు కీలక నేతలు జైలుకు వెళ్లక తప్పదని మంత్రి శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా.. మంత్రి పొంగులేటి వ్యాఖ్యలపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తనదైన స్టైల్లో స్పందించారు. మంత్రి చెప్పింది కరెక్టేనని.. దీపావళికి 100 శాతం బాంబులు పేలబోతున్నాయని కామెంట్ చేశారు.

## ఇది స్టిల్ మాత్రమే..



**సినిమా :** కోలీవుడ్ ప్రముఖ నటుడు జయం రవి.. నటి ప్రియాంక మోహన్‌ను పెళ్లాడబోతున్నట్టు వార్తలొచ్చాయి. వీరిద్దరూ నిశ్చితార్థం చేసుకున్నట్టు చెబుతూ ఇద్దరూ పూల దండలు వేసుకుని ఉన్న ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. తాజాగా, ఈ వార్తలపై ప్రియాంక స్పందించారు. ఆ వార్తల్లో ఎంతమాత్రమూ నిజం లేదని తేల్చి చెప్పారు. ఆ వార్తలు తనను షాక్‌కు గురిచేశాయని చెప్పారు. తామిద్దరం 'బ్రదర్' సినిమా కోసం కలిసి పని చేశామని, ఆ సినిమా ప్రమోషన్‌లో భాగంగా చిత్ర బృందం ఈ ఫొటోను రిలీజ్ చేసినట్టు తెలిపారు. ఆ ఫొటో చూసిన వారు తమకు ఎంగేజ్‌మెంట్ అయిందని అనుకున్నారని తెలిపారు. షూటింగ్స్‌తో తాను బిజీగా ఉండడం వల్ల ఈ విషయం తన దృష్టికి రాలేదని చెప్పారు. ఆ ఫొటో నిజమేననుకుని టాలీవుడ్‌లోని తన స్నేహితులు కూడా కాల్ చేశారని తెలిపారు. దీంతో ఏం జరుగుతోందో తనకు అర్థం కాలేదని, అది సినిమాలోని స్టిల్ మాత్రమేనని చెప్పానని వివరించారు. ఈ ఫొటోను రిలీజ్ చేసిన మూవీ టీంను తిట్టుకున్నానని చెప్పారు. ఈ ఘటన తనకు ఎప్పటికీ గుర్తుండిపోతుందని ప్రియాంక పేర్కొన్నారు.



## బలమైన ఉద్యమం చేపడుతాం

**మందకృష్ణ మాదిగ**



**హైదరాబాద్, ప్రజాస్వరం:** చేయూత పింఛన్ తీసుకునే వారిని రేవంత్ ప్రభుత్వం నట్టేట ముంచిందని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శించారు. వీరితో కలిసి బలమైన ఉద్యమం చేపడతామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నమ్మిన పింఛన్‌దారులు కాంగ్రెస్‌ను గెలిపించారని చెప్పారు. 10 నెలలు అయినా.. ఎందుకు పెంచి ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఏపీలో ఏప్రిల్ నెలలో మేం చంద్రబాబుకు వినతి పత్రం ఇచ్చాం. దివ్యాంగులకు రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలని కోరామన్నారు. ఆయన జూన్‌లో అధికారంలోకి రాగానే ఏప్రిల్, మే, జూన్ మూడు నెలలవి ఇచ్చారన్నారు. ఏపీలో కండరాల క్షీణత ఉన్నవాళ్లకు రూ.15 వేల పింఛన్లు ఇస్తున్నారన్నారు. రేవంత్ కంటే చంద్రబాబునయమన్నారు. తెలంగాణలో వచ్చే నెల మొదటి వారంలో గడిచిన 10 నెలల బకాయిలతో పాటు నవంబర్ పింఛన్ ఇవ్వాలన్నారు. లేదంటే ఉద్యమం తప్పదన్నారు. నవంబర్ 1 నుంచి 16 వరకు ప్రతిరోజు రెండు జిల్లాల్లో చేయూత పింఛన్ లబ్ధిదారులకు చైతన్య సభలు నిర్వహిస్తాన్నారు. అప్పటికీ ఇవ్వకుంటే నవంబర్ 26న చలో హైదరాబాద్‌కు పిలుపునిస్తామన్నారు. 26న వికలాంగుల మహా గర్జన పేరిట వేలాది మందితో ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేపడతామన్నారు. కాంగ్రెసేతర అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తామన్నారు.. రేవంత్ ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకుంటాం'' అని మందకృష్ణ అన్నారు.


## 'గుస్సాడి'కి గుర్తింపు తెచ్చిన కనకరాజు ఇక లేరు



**హైదరాబాద్, ప్రజాస్వరం :** గిరిజన సాంప్రదాయ నృత్యమైన 'గుస్సాడి'కి ప్రత్యేక గుర్తింపు తీసుకుకొచ్చిన పద్మశ్రీ అవార్డు గ్రహీత శ్రీ కనకరాజు గారు ఇకలేరని తెలిసి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తెలంగాణలోని మారుమూల ప్రాంతమైన ఆసిఫాబాద్ కుమురం భీం జిల్లా నుంచి వచ్చి.. గుస్సాడికి గుర్తింపు తీసుకురావడం కోసం సర్వస్వాన్ని త్యాగం చేసిన శ్రీ కనకరాజు గారి మృతి తెలంగాణకు మరీ ముఖ్యంగా గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు తీరని లోటు అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ.. కుటుంబసభ్యులకు, గిరిజన సమాజానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఇజ్రాయెల్ భీకర దాడులు

**అంతర్జాతీయం:** ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను లక్ష్యంగా చేసుకున్న ఇజ్రాయెల్ వందలాది విమానాలతో ఈ తెల్లవారుజామున భీకర దాడులు జరిపింది. ఈ దాడుల నేపథ్యంలో జరిగిన పేలుళ్లతో టెహ్రాన్ చిగురుటాకులా కంపించింది. ఇజ్రాయెల్ విమానాలు వేసిన బాంబులు దీపావళి రోజున ఆకాశంలో పేలిన టపాసులను తలపించాయి. అయితే, ఇజ్రాయెల్ దాడుల వల్ల తమకు పరిమితంగానే నష్టం వాటిల్లినట్టు ఇరాన్ స్పష్టం చేసింది.



## బెటాలియన్ పోలీసుల ఆందోళన

**ఒకే పోలీసు విధానానికి డిమాండ్**

**హైదరాబాద్, ప్రజాస్వరం:** ఒకే పోలీసు విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బెటాలియన్ పోలీసులు ఆందోళనకు దిగారు. నిరసన కార్యక్రమాల్లో కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. వరంగల్ జిల్లాలోని మామునూరులో 4వ బెటాలియన్ కానిస్టేబుళ్లు ఆందోళన చేపట్టారు. మామునూరు బెటాలియన్ కమాండెంట్ ఆఫీస్ వద్ద బైఠాయించి నిరసనకు దిగారు. ఆందోళనల నేపథ్యంలో నల్గొండ గ్రామీణ ఎస్ఐ సైదాబాబుకు నిరసన సెగ తగిలింది. ఎస్ఐ గోబ్యాక్ అంటూ 12వ బెటాలియన్ కానిస్టేబుళ్లు నినాదాలు చేశారు. పోలీసుల కుటుంబసభ్యులపై సైదాబాబు దురుసుగా ప్రవర్తించారని నిరసనకు దిగారు.

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు నిరసనకు దిగారు. సాగర్ రోడ్డుపై ధర్నా చేపట్టారు.

